# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 7 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 12 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :7 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 12 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# శాంతిభద్రతలే లక్ష్యం

## ‘త్రిశూల్’ ఆపరేషన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం

- ‘త్రిశూల్’ పేరుతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- డ్రగ్స్, మహిళలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై కఠిన చర్యలకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్న ముఖ్యమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆవేదన




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ‘త్రిశూల్’ పేరుతో ప్రత్యేక కార్యాచరణకు ఆయన శ్రీకారం చుట్టారు. ‘జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు’ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ‘త్రిశూల్’ పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, వ్యవస్థీకృతంగా సాగుతున్న వేధింపులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఈ అంశాలపై మంత్రుల కమిటీ లోతైన అధ్యయనం చేస్తుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 30 మంది కానిస్టేబుళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి

- మిగతా 2లో

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు.. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు



- మార్చి 2027 నాటికి దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం
- 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2028 డిసెంబర్‌కల్లా ప్రతి గ్రామీణ ఇంటికి కుళాయి కనెక్షన్
- 2027 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధన.. 50 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ



## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- డీఎస్సీతో 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్న కేశినేని చిన్ని
- డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని విమర్శ
- ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

- మిగతా 2లో



## అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు..

### అప్రమత్తమైన ప్రభుత్వం

పెన్ పవర్ డెస్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున

- మిగతా 2లో

## ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు విడుదల

- సెప్టెంబరు జీతంతో పెంచిన డీఏ
- 2025 జనవరి నుంచి 1.82 శాతం డీఏ అమలు
- 2024 జులై నుంచి 2.73 శాతం డీఏ
- 2028లో 1.82 శాతం డీఏ బకాయిలు
- పింఛనుదారులకూ ఇదే షెడ్యూల్‌లో బకాయిలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రెండు డీఏలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ

- మిగతా 2లో

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

- మిగతా 2లో





## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

### హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

- మిగతా 2లో



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్..

### ‘బ్రిక్స్’ బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్
- జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి
- ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి
- జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన
- బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన

- మిగతా 2లో

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ‘బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్’లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు.

- మిగతా 2లో



## మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

పెన్ పవర్ డెస్క్: ఫాస్టాగ్ కారణంగా టోల్‌ప్లాజాల వద్ద వేచి చూసే సమయం గణనీయంగా తగ్గిందని, వచ్చే ఏడాది నుంచి అసలు ఆగే అవసరమే ఉండదంటున్నారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2027 మార్చి కల్లా బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు

- మిగతా 2లో

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి

- మిగతా 2లో

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు

పెన్ పవర్ డెస్క్:ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ‘అనలాగ్’ (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# మాధవ్ మాట వింటారా? అందరూ సీతయ్యలేగా?

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారనున్నాయి. అన్ని రకాల వత్తిడిలు ఆయన ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఒకవైపు రాష్ట్రంలో కూటమిలోని మిత్ర పక్షాలతో సమన్వయం చేసుకుని వెళ్లడం, మరొకవైపు సొంత పార్టీ నేతలను సంతృప్తిపర్చడం మాధవుడికి ఛాలెంజ్ అని చెప్పాలి. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయిన తర్వాత జరిగే తొలి ఎన్నికలు కావడంతో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మరొకవైపు కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఎదగలేదు. అలాగే పొత్తు లేకుండా గెలిచే సీన్ లేదు. ఆ సంగతి తెలిసినా కేంద్ర నాయకత్వం దృష్టిలో ఈ ఎన్నికల ఫలితాలు తన నాయకత్వం సామర్థ్యంపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో మాధవ్ ఉన్నారని అంటున్నారు. నేతలు మాధవ్ కు సహకరించే విషయంలో కూడా తక్కువేనని చెప్పాలి.

**పార్టీ బలోపేతానికి...**

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎక్కువ స్థానాలపై పట్టు సాధించడమే బీజేపీ ప్రధాన వ్యూహంగా ఉంది. బీజేపీ రాష్ట్రంలో నాలుగు జోన్లుగా విభజన చేసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎన్నికల నిర్వహణ, వ్యూహ రచన కోసం రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమనాలుగు జోన్లుగా విభజించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ స్ట్రాటజీ ప్రకారం సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. విశాఖ, రాజమండ్రి, తిరుపతి, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు మరియు జెడ్పీ స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఢిల్లీ అధిష్టానం రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేసింది.

**సీనియర్ నేతలను...**

కూటమి ధర్మం పాటిస్తూనే, పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేలా సీట్ల సర్దుబాటుపై జనసేన, టీడీపీలపై బీజేపీ ఒత్తిడి పెంచుతోంది.శక్తి కేంద్రాలు, మ్యానిఫెస్టో ప్రచారం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రాష్ట్రంలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. మరొకవైపు పార్టీలో నేతలందరూ సీనియర్లు. వారు ఎవరి మాట వినరు. దాదాపు అందరూ సీతయ్యలే. అందుకే నాయకులను సమన్వయం చేసుకుని ప్రజల వద్దకు వెళుతూ పార్టీని బలోపేతం చేయాలంటే ఒక్క అధ్యక్షుడి వల్ల కాదు. సమిష్టిగానే పార్టీ ఎదుగుదల, విజయం సాధ్యమవుతుంది. కానీ ఓటమి మాత్రం మాధవ్ ఖాతాలో పడే అవకాశముంది. అందుకే మాధవ్ లో అలజడి మొదలయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుకున్న స్థానాలను సాధించడంతో పాటు గెలిపించుకోవడం కూడా అతి పెద్ద సమస్య మాధవ్ ముందుంది. మరి దీనిని ఎలా అధిగమిస్తారన్నది చూడాలి.

### ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

## హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు.. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు

రాష్ట్రంలో పాలనను గాడిన పెట్టే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశిస్తూ, వాటిని పూర్తి చేయడానికి కచ్చితమైన గడువును ఖరారు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం నుంచి అభివృద్ధి పనుల వరకు ప్రతి అంశంలోనూ వేగం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన భూ వివాదాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను 2027 మార్చి నాటికి పూర్తిగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సెక్షన్-22ఏ దరఖాస్తులను 2026 అక్టోబర్ నాటికి క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గృహ నిర్మాణం రంగంలో భాగంగా, 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని స్పష్టం చేశారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. 2028 డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరాకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, జలవనరులను పునరుద్ధరించాలని జలవనరుల శాఖకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, ఉపాధి రంగాలపై ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. 2027 నాటికి రాష్ట్రంలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలని, 50 లక్షల మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. పరిశ్రమలను ప్రోత్సహించడం, 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడం, ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని సూచించారు. ఇంధన రంగంలో భాగంగా 9 లక్షల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ లక్ష్యాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు.పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది.

మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# శాంతిభద్రతలే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

విస్తృత ప్రచారం కల్పించాలని, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి నగరాల్లో డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ప్రతి ప్రమాదాన్ని క్షుణ్ణంగా ఆడిట్ చేసి, అందుకు గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు.గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 29.2 శాతం తగ్గాయని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం శిక్షల ఖరారు రేటు (కన్విక్షన్ రేటు) 47 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. నేరం జరిగిన 30 నిమిషాల్లోపే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి 'వన్ కోర్టు-వన్ కానిస్టేబుల్' విధానాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు.బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- మొదటి పేజి తరువాయి

డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో

ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

## ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు విడుదల

- మొదటి పేజి తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏలను సెప్టెంబరు నెల జీతంతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. 2025 జనవరి 1 నుంచి 1.82 శాతం డీఏ అమల్లోకి రానుంది. దీనికి సంబంధించిన 20 నెలల బకాయిలను 2028లో నాలుగు విడతల్లో చెల్లించనున్నారు. జనవరి, మార్చి, మే, జులై నెలల్లో బకాయిలు జమ చేయనున్నారు.అలాగే 2024 జులై 1 నుంచి 2.73 శాతం డీఏ చెల్లించనున్నారు. దీనికి సంబంధించిన 26 నెలల బకాయిలను 2027లో నాలుగు విడతల్లో అందించనున్నారు. ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరు నెలల్లో బకాయిలు చెల్లించనున్నారు.

పింఛనుదారులకు కూడా ఇదే విధానంలో డీఏ బకాయిలను

చెల్లించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులు, పింఛనుదారులకు సెప్టెంబరు జీతంతోనే పెరిగిన డీఏ ప్రయోజనం అందనుంది.

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- మొదటి పేజి తరువాయి

వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది.పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(ఝ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- మొదటి పేజి తరువాయి

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు.బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

- మొదటి పేజి తరువాయి

అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ముబయిలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆయన మాట్లాడారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.టోల్‌బూత్‌ల వద్ద ఒకప్పుడు సగటున 12 నిమిషాలు వేచి ఉండాల్సి వచ్చేదని గడ్కరీ అన్నారు. కొన్ని సందర్భాల్లో 30 నిమిషాలు కూడా పట్టేదన్నారు. ఫాస్టాగ్ ) కారణంగా ఈ సమయం 80-90 శాతం తగ్గిందని తెలిపారు. బ్యారియర్లు లేని టోల్‌బూత్‌ల వల్ల ఆ సమయం ఇంకా తగ్గుముఖం పడుతుందని మంత్రి వివరించారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు ఏటా రూ.10వేల కోట్లు ఆదాయం అదనంగా ప్రభుత్వానికి సమకూరుతుందన్నారు. వార్షికంగా సుమారు రూ.5,250 కోట్ల మేర ఇంధనం కూడా ఆదా అవుతుందని చెప్పారు.బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కొనసాగుతోందని గడ్కరీ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 శాతం టోల్‌బూత్‌ల వద్ద అడ్డంకులు తొలగనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా నూరు శాతం పూర్తవుతుందన్నారు. ప్రతిపాదిత విధానంలో మానవ ప్రమేయం లేకుండానే టోల్ వసూలు సాధ్యం కానుందని చెప్పారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) సాంకేతికతను ఫాస్టాగ్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్‌తో అనుసంధానించడం ద్వారా టోల్ చెల్లించడానికి వాహనం ఆగకుండానే ఫీజు వసూలు పూర్తవుతుందని వివరించారు.

### అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు..

## అప్రమత్తమైన ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హోం మంత్రి సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**పెడన,పెన్ పవర్, సెప్టెంబర్ 11**

పెడన పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు రూ.72,80,948 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**

గుంటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వయంగా స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, పెన్షన్లు, భూ సమస్యలు వంటి 24 అంశాలకు సంబంధించి ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి, వారికి సత్వర సేవలు అందిస్తూ పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు అందించే ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులతో





సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో అందిన కొన్ని వినతులపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే తక్షణమే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు,అభిమానులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ సంబరాలు



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా ముగిశాయి. ఐదు దశాబ్దాలుగా విద్య, పరిశోధన, సామాజిక, సాంకేతిక రంగాల్లో విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఘనంగా స్మరించుకున్నారు. వేడుకల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాభై వసంతాల స్వర్ణోత్సవ స్మారక చిహ్నాన్ని గవర్నర్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగాధర్ రావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ శ్రీ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అక్షరాల నుంచి ఆవిష్కరణల వరకు సాగిన ఐదు దశాబ్దాల జ్ఞాన ప్రస్థానం విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని వక్తలు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం పట్ల ఆనందం వ్యక్తమైంది. స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఐదు దశాబ్దాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యాభై ఏళ్ల విజయ ప్రస్థానం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# డోర్ టు డోర్ కార్యక్రమం పూర్తి చేసిన టీడీపీ శ్రేణులకు ప్రత్యేక గుర్తింపు ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**

పశ్చిమ నియోజకవర్గంలోని ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని 100% పూర్తి చేసిన టీడీపీ శ్రేణులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు సందర్శించనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించి, ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు చిరువ్యాపారులకు జీవనాధారంగా మూడు తోపుడు బండ్లను అందజేశారు.

అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, డివిజన్లలో ఇంటింటికి వెళ్లి అర్హులైన పేదలను గుర్తించి పెన్షన్ దరఖాస్తులు చేసుకునేలా సహాయం అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇటీవల చేపట్టిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి చేసిన బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులు మరియు కార్యకర్తలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో వారు చూపిన అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. వారి సేవలకు గుర్తింపుగా సెప్టెంబర్ 13 (ఆదివారం) న ప్రత్యేక పర్యటనను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రకటించారు. ఈ పర్యటనలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన నాయకులు, కార్యకర్తలు వెలిగొండ ప్రాజెక్టునుసందర్శించడంతో పాటు శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును పార్టీ కార్యకర్తలు ప్రత్యక్షంగా వీక్షించి దాని ప్రాముఖ్యతను తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటనను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.



# చిరంజీవిపై అసభ్యకర పోస్టులు.. పోలీసులకు ఫిర్యాదు



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**

కొణిదల చిరంజీవిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, మార్ఫింగ్ చిత్రాలు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధులు పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణకు చెందిన నవీన్ కుమార్ గౌడ్ పేరుతో ఉన్న వ్యక్తి ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి చిరంజీవిని అవమానించేలా పోస్టులు చేస్తున్నారని మెగా యూత్ ఫోర్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింత శివ ఆరోపించారు. డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, చిరంజీవి, జనసేన పార్టీపై కూడా అభ్యంతరకరమైన పోస్టులు చేస్తున్న వ్యక్తిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షురాలు కొణిదెల సుస్మిత ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు చింత శివ వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి పోస్టులను నవీన్ కుమార్ గౌడ్ కొనసాగిస్తే భౌతిక దాడులకు దిగుతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర, అవమానకర పోస్టులు పెట్టకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

## సేవా సంకల్ప అభియాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: పీవీఎన్ మాధవ్



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**

గుంటూరుఅమరావతి రోడ్డులోని ఏ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన జరిగింది. జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ జీ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించే సేవా సంకల్ప అభియాన్‌లో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలతో సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనతా వారధి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. శివ ప్రకాష్ జీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కనీసం రెండు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని




సుమారు 46 వేల బూత్‌లలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. శాసనమండలి బీజేపీ పక్ష నేత సోము వీర్రాజు మాట్లాడుతూ లక్ష్యంతో పనిచేస్తే ఫలితాలు సాధ్యమవుతాయని, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వనాథ జయంతి



**మచిలీపట్నం, పెన్ పవర్,సెప్టెంబర్11**

తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని మచిలీపట్నం నగర కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెడన మండలం నందమూరులో జన్మించిన విశ్వనాథ తెలుగు సాహిత్య కీర్తిని దేశవ్యాప్తంగా చాటారని వక్తలు అన్నారు. ఆయన రచించిన 'వేయి పడగలు' వంటి రచనలు నేటికీ సాహిత్య రంగంలో సజీవంగా ఉన్నాయని తెలిపారు. జయంతిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారికంగా నిర్వహించాలని, అమరావతిలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్. బాపిరాజు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, సాహితీమిత్రుల సంస్థ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య, పీవీ ఫణికుమార్, ముదిగొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. విశ్వనాథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖుల చిత్రాలను కార్పొరేషన్ గోడలపై చిత్రీకరించిన కమిషనర్ బాపిరాజును లంకిశెట్టి బాలాజీ సన్మానించారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**

ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 136 అర్జీలను స్వీకరించడం జరిగిందని.. ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నారు.

ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. నందిగామ-మధిరరోడ్డులోని ఆర్.ఎస్.గార్డెన్స్ నందు జరిగిన ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య.. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 136 అర్జీలు అందగా వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 69, పంచాయతీరాజ్‌కు 19, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డుకు 15, పట్టణ పరిపాలనకు 9, విద్యుత్‌కు 5, సర్వేకు 4, రహదారులు-భవనాల శాఖకు 4, విద్యా శాఖకు 3 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా వైద్య ఆరోగ్యం శాఖకు 2, గృహ నిర్మాణం శాఖకు 2, పోలీసు, డ్వామా, రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ అర్జీలను క్షుణ్నంగా పరిశీలించి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజల చెంతకే అధికారులు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరించే లక్ష్యంతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చిట్టి చేతులతో జిఎంసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్

## కమిషనర్ మయూర్ అశోక్






**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
నవ గుంటూరులో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ గుంటూరు నగరపాలక సంస్థ నిర్వహించిన గ్రీన్ గణేష్ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయే ఘనతను సాధించింది. శుక్రవారం నగరంలోని 55 పాఠశాలలకు చెందిన సుమారు 25 వేల మంది విద్యార్థులు ఏకకాలంలో మట్టి గణేష్ ప్రతిమలను తయారు చేసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు.
సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే పర్యావరణ పరిరక్షణకు మార్గం చూపేలా జిఎంసి చేపట్టిన గ్రీన్ గణేష్ కార్యక్రమం విద్యార్థులు, ప్రజల్లో విశేష అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు సర్టిఫికేట్‌ను ఆ సంస్థ జాయింట్ సెక్రటరీ ఎలియాజ్ అందజేశారు.
ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైకత వినాయక ప్రతిమ, వేదికపై ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహం, విద్యార్థులు రూపొందించిన పెయింటింగ్‌లు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రికార్డు సాధించడంతో పాటు నగరంలోని 25 వేల కుటుంబాలకు పర్యావరణహిత గణేష్ ప్రతిమలు చేరడం పట్ల కమిషనర్ మయూర్ అశోక్ ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన విద్యా సంస్థల యాజమాన్యాలు, గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు, విద్యాశాఖ అధికారులను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్‌డీఏ, ఎన్‌ఏ, సీడీఎస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం



**విజయవాడ, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
ఈ నెల 13వ తేదీన జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ; కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీనరసింహం.. యూపీఎస్సీ అబ్జర్వర్ భాను జోషితో కలిసి లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల13వ తేదీ ఆదివారం విజయవాడలోని అయిదు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 691 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏకు 1,019 మంది మొత్తం 1,710 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఎస్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు సెషన్-1, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు సెషన్-2, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు సెషన్-3 జరగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏకు సంబంధించి సెషన్-1 ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకు సెషన్-2 మధ్యాహ్నం 2 గం. నుంచి సాయంత్రం 4.30 గం. వరకు జరుగుతుందని వివరించారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని.. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని.. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, రవాణా సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని డీఆర్‌వో లక్ష్మీనరసింహం, సమన్వయ శాఖల అధికారులకు సూచించారు.

# అటవీ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం




**గుంటూరు : పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి ఎకో పార్కులో ఘనంగా నిర్వహించారు. అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి పరిరక్షణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అటవీ అధికారులు, సిబ్బంది సేవలను ఈ సందర్భంగా స్మరించుకుని ఘన నివాళులు అర్పించారు. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని ఖేజర్లీ ప్రాంతంలో ఖేజ్రీ చెట్లను నరికివేయడాన్ని వ్యతిరేకిస్తూ బిష్ణోయ్ సమాజానికి చెందిన 360 మందికి పైగా ప్రజలు తమ ప్రాణాలను త్యాగం చేసిన ఘటన అటవీ పరిరక్షణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి, అటవీ దళాధిపతి డాక్టర్ పి.వి. చలపతి రావు పాల్గొని అమరులైన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకున్నారు. అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి వనరుల పరిరక్షణలో అటవీ సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అడవులు పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల జీవనోపాధికి ఎంతో కీలకమన్నారు. అటవీ సంపదను అక్రమ రవాణా, ఆక్రమణల నుంచి కాపాడేందుకు అటవీ శాఖ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లోనూ అటవీ, వన్యప్రాణుల పరిరక్షణలో విధులు నిర్వహిస్తూ పలువురు అటవీ అధికారులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. అక్రమ కలప, ఎర్రచందనం స్మగ్లర్లను ఎదుర్కొంటూ, తీవ్రవాదుల దాడులు, వన్యప్రాణుల దాడులు, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ అమరులైన అటవీ సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.అమరులైన అటవీ సిబ్బంది త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి వనరులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మరింత అంకితభావంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.అటవీ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం.. వారి ధైర్యం మనందరికీ స్ఫూర్తిదాయకం.

# పర్యావరణహిత వినాయక చవితికి ప్రాధాన్యత ఇవ్వాలి

## కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డా. పి. క్రిష్ణయ్య



**గుంటూరు , పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డా. పి. క్రిష్ణయ్య పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఏపీపీసీబీ ఆధ్వర్యంలో అమరావతి సచివాలయంలోని మూడో బ్లాక్‌లో సుమారు 3 వేల విత్తనాలతో కూడిన మట్టి గణపతులను సచివాలయ ఉద్యోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. గుంటూరు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి నజీనా బేగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలను నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యంతో పాటు భూగర్భ జలాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల సంప్రదాయాన్ని కాపాడుకుంటూనే సహజ పదార్థాలతో తయారు చేసిన పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని సూచించారు.విత్తనాలతో కూడిన మట్టి గణపతులను నిమజ్జనం అనంతరం ఆ విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదిగేలా రూపొందించినట్లు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరులను పరిరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వారి స్ఫూర్తితో ప్రజలందరూ పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని డా. క్రిష్ణయ్య కోరారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బందికి సీఆర్ఎస్, హెచ్‌ఎంఐఎస్‌పై శిక్షణ



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
మంగళగిరితాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ జనన, మరణ వివరాలను సకాలంలో, ఖచ్చితంగా నమోదు చేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. మల్లిక సూచించారు..శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందికి సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్), హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్)పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు... డాక్టర్ మల్లిక మాట్లాడుతూ జనన, మరణ నమోదు ప్రక్రియలో జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వివరాలను సీఆర్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు..అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆసుపత్రులు హెచ్‌ఎంఐఎస్‌లో ఆరోగ్య సమాచారాన్ని ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఖచ్చితమైన సమాచారం కీలకమన్నారు..



స్టాటిస్టికల్ ఆఫీసర్ వి. పద్మజ, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ కె. భాను శ్రీ, డీపీఓ కె. ఏకే చైతన్యలు సీఆర్ఎస్, హెచ్‌ఎంఐఎస్‌లో వివరాల నమోదు, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో సమాచారం సమర్పణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలు ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం అక్టోబర్ 5 వరకు

### -40,802 ఫారం-6 దరఖాస్తులు..

### 27,224 పరిష్కారం

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 10తో ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను అక్టోబర్ 5 వరకు పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.
ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 కింద 40,802 దరఖాస్తులు అందగా, ఇప్పటికే 27,224 దరఖాస్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. అనర్హుల పేర్ల తొలగింపునకు ఫారం-7 కింద 21,023 దరఖాస్తులు, ఓటరు వివరాల మార్పులు, చిరునామా మార్పు, గుర్తింపు కార్డు తదితర అంశాల కోసం ఫారం-8 కింద



44,638 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.
ముసాయిదా జాబితా ప్రచురణకు ముందు అందిన దరఖాస్తులతో కలిపి ప్రస్తుతం ఫారం-6లో 10,330, ఫారం-7లో 982, ఫారం-8లో 7,447 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు.
ఎన్యుమరేషన్ పత్రాల్లో లోపాలు గుర్తించిన 1,94,681 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, వారిలో 1,83,300 మంది విచారణ పూర్తయిందని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత నిరూపించుకోలేకపోయిన 6,280 మందిని అనర్హులుగా గుర్తించినట్లు వెల్లడించారు.
అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకుండా, అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# వైభవంగా కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు

**చల్లపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 11**
200 మంది జానపద కళాకారులతో ఘనంగా కళా ప్రదర్శనలు.. హాజరైన విక్కుర్తి శ్రీనివాసరావు
శ్రీకాకుళం: తెలుగు సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా నిర్వహించారు. కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ చైర్మన్, కవి వంశీయుడు డాక్టర్ కాసుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాకుళేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కాసుల పురుషోత్తమ కవి విగ్రహానికి విక్కుర్తి శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జానపద కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సుమారు 200 మంది జానపద కళాకారులు ప్రత్యేక వేషధారణలతో పాల్గొని వివిధ కళారూపాలు, మురళి, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాసుల పురుషోత్తమ కవి తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల సాహితీ వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న జానపద కళలను ప్రోత్సహించడం అభినందనీయమని, 200 మంది కళాకారులతో ఇంత ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా మన సంప్రదాయ కళలకు మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కాసుల పురుషోత్తమ కవి జయంతి వేడుకలను ఇంత వైభవంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక భాషా సాంస్కృతిక శాఖ, కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో నిర్వహించిన కార్యక్రమాల స్ఫూర్తితో ఈ జయంతి మహోత్సవాలను నిర్వహించినట్లు డాక్టర్ కాసుల కృష్ణంరాజు తెలిపారు. 21 మంది ప్రాచీన కవుల



వంశీయుల కుటుంబాలు పాల్గొన్న కార్యక్రమాల నేపథ్యంలో కాసుల పురుషోత్తమ కవి సాహితీ సేవలను ప్రజలకు మరింతగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు.

# టిడ్కో లబ్ధిదారులకు 50 ఇళ్ల

- నాన్-అలాటీలకు రూ.21.52 లక్షలు తిరిగి చెల్లింపు
- పి.ఎం.ఏ.వై -యు 2.0 కింద డిమాండ్ సర్వే ప్రారంభం
- అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం
- నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 11:**
అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయటమే లక్ష్యంగా ఉమ్మడి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ మున్సిపల్ బంగ్లాలో టిట్కో గృహలబ్ధిదారులకు గృహ స్వాధీన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు గృహ స్వాధీన పత్రాలు అందించారు. గతంలో టిడ్కో గృహాల కోసం నగదు చెల్లించినప్పటికీ గృహాలు మంజూరు కాని 46 మంది నాన్-అలాటీలకు వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తూ మొత్తం రూ.21.52 లక్షల విలువైన చెక్కులను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందజేశారు. అదే సమయంలో అర్హత పొందిన లబ్ధిదారులకు 50 టిడ్కో గృహాలను స్వాధీనం చేశారు. గృహాలకు సంబంధించిన స్వాధీనం పత్రాలను కూడా ఎమ్మెల్యే అందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నరసరావుపేటలో సుమారు 850 టిడ్కో గృహాలను ఇప్పటికే లబ్ధిదారులకు హ్యాండ్‌ఓవర్ చేసినట్లు తెలిపారు. ఇంకా 211 గృహాలకు సంబంధించిన వ్యవహారాలు కోర్టు పరిధిలో ఉన్నాయని, న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కాగానే వాటిని కూడా అర్హులైన లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**కోర్టు సమస్యలు పరిష్కరించి ఇళ్లు అప్పగిస్తాం**

కొంతమంది లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకుని ఈఎంఐలు చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రుణ బకాయిలు, ఇతర న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకుని మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తే గృహాలను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం స్వాధీనం చేసిన 50 గృహాల్లో లబ్ధిదారులు నివాసం ఏర్పరచుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. టిడ్కో గృహాల విషయంలో గతంలో వైసీపీ వాళ్లు అసలు లబ్ధిదారుల పేర్ల స్థానంలో ఇతరుల పేర్లు చేర్చారని అర్హులైన అసలు లబ్ధిదారులకు న్యాయం జరిగేలా న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకున్నామని ఎమ్మెల్యే చెప్పారు. 1,504 గృహాల విషయంలో పేర్ల మార్పుపై వివాదాలు ఏర్పడి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ అంశంలో ఎవరి గృహం వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**నాన్-అలాటీలకు డబ్బులు తిరిగి చెల్లింపు**

టిడ్కో గృహాలు పొందే అవకాశం లేని లేదా స్వచ్ఛందంగా తమ క్లెయిమ్‌ను ఉపసంహరించుకుంటున్న లబ్ధిదారులకు వారు గతంలో చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగానే శుక్రవారం 46 మందికి రూ.21.52 లక్షలు చెక్కుల రూపంలో అందించినట్లు చెప్పారు.
న్యాయపోరాటానికి సహకరించిన వారికి అభినందనలు



టిడ్కో గృహాల సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు గూడురు శేఖర్, విజయకాంత్ తదితరులు చేసిన కృషిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కోర్టు వ్యవహారాల్లో లబ్ధిదారుల తరఫున కేసులు వేయడం, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు తిరగడం వంటి అంశాల్లో వారు శ్రమించారని పేర్కొన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన ఖర్చులను తాను భరించానని ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో కేసుకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతున్న పరిస్థితుల్లో లబ్ధిదారులకు అండగా నిలిచామని చెప్పారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులు గూడురు శేఖర్, విజయకాంత్ చేసిన కృషిని గుర్తుంచుకోవాలని కోరారు.

**ఇచ్చిన హామీలను అమలు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. భవిష్యత్తులో అర్హులకు ఇళ్ల స్థలాలు అందించే దిశగా కూడా చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఏపీ బులియన్ మర్చంట్ అధ్యక్షులు కపలవాయు విజయ్ కుమార్, టిడిపి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మాబు, ఐటిడిపి మస్తాన్ వలి, నరసరావుపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ సిబ్బంది, మున్సిపాలిటీ అధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యస్ బి ఐ ఏటీఎంలో అగ్ని ప్రమాదం

**- సకాలంలో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు.. తప్పిన పెను ప్రమాదం**

**- హుటాహుటిన మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది**




**బాపట్ల, సెప్టెంబర్ 11(పెన్ పవర్) :**
బాపట్ల పట్టణంలోని వన్‌వే సెంటర్ సమీపంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యస్ బి ఐ) ఏటీఎంలో శుక్రవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఏటీఎం మెషీన్ నుంచి ఒక్కసారిగా పొగలు వెలువడి అనంతరం మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రజలను ఏటీఎం సమీపానికి రాకుండా నియంత్రించడంతో పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అనంతరం ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలు పక్కనున్న దుకాణాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టి అతి తక్కువ సమయంలోనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ఏటీఎంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే ఏటీఎం మెషీన్, ఏసీ, సీసీ కెమెరాలు దగ్ధమైనట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏటీఎంలోని నగదు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# వార్డుల పునర్విభజనపై 39 అభ్యంతరాలు కమిషనర్ కె. మయూర్ అశోక్




**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన వార్డుల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఇప్పటివరకు 39 అభ్యంతరాలు, వినతులు, సూచనలు అందినట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్వో, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందిన 39 వినతుల్లో తెలుగుదేశం పార్టీ నుంచి 25, జనసేన పార్టీ నుంచి 9, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 2, భారతీయ జనతా పార్టీ నుంచి 2, వ్యక్తిగతంగా ఒక వినతి ఉన్నట్లు తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీలు సమర్పించిన అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 12న సీడీఎంఏకు పంపనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అనంతరం సెప్టెంబర్ 13న తుది వార్డులను ఖరారు చేసి, సెప్టెంబర్ 14న ఏపీ గెజిట్ ఫారంఎ×లో తుది నోటిఫికేషన్ ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

# నరసరావుపేటలో వినాయకుని వ్రతకల్ప పుస్తకాలు విడుదల

**ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 11:**
ద గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూపొందించిన వినాయకుని వ్రతకల్ప పుస్తకాలను స్థానిక పెద్ద చెరువు ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెటింగ్ ఆఫీసర్‌గా చేగు వెంకటేశ్వరరావు నియమితులైన సందర్భంగా వినాయకుని వ్రతకల్ప పుస్తకాలను తన చేతుల మీదుగా విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజలు నిర్వహించాలని ఆకాంక్షించారు. వినాయకుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, ద గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ కొండవీటి శ్రీనివాసరావు, బత్తుల మురళి, కపలవాయి విజయ్ కుమార్, సత్తెనపల్లి రోడ్డులోని సాయిబాబా గుడి చైర్మన్ బ్రహ్మయ్య, ఆర్ఎంపీ డాక్టర్ మాధవరావు, కాల్వ రవి, పూనూరి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
ప్రజలకు ఏ కష్టమొచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కరిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి పొజిషన్ ఎక్కడ ఉందో ఇప్పటి వరకు చూపించలేదని అర్జీలో పేర్కొన్నారు. సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్నామని, నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్, అర్హులైన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి, అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు ప్రజలందరికీ చేరేలా నిరంతరం అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలోనే కాకుండా ప్రతి రోజూ వార్డుల పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. వార్డుల్లో కూటమి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వాన్ని చేరువ చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మంచి పాలన సాగుతోందన్నారు.

# కొత్త అడుగులు.. కొత్త ఆశలు.. ఘన స్వాగతం!

**- విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణే బలమని సందేశం**

**- సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలలో వైభవంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**




**చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమైనదని, ఈ దశను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని వక్తలు సూచించారు. చీరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా రెవరెండ్ నానిబాబు "నీ భవిష్యత్తు దేవుని చేతిలో ఉంటుంది" అనే అంశంపై వాక్య పరిచర్య అందించారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడి, నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.అనంతరం రెవరెండ్ లెనిన్ బాబు విద్యార్థులకు దీవెనలు అందిస్తూ, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని, తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని ఆకాంక్షించారు.ఫ్రెషర్స్ డేలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చాటుకున్నారు. నూతన విద్యార్థులు సైతం సీనియర్ విద్యార్థులతో కలిసి వేడుకల్లో ఆనందంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత బేతాల సాల్మన్ రాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐ. బాబూరావు హాజరై నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, మానవతా దృక్పథం, సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బేతాల సాల్మన్ రాజును కళాశాల బృందం పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఘనంగా సత్కరించింది.కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ నూతన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే ద్వారా ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో లభిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యా ప్రమాణాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సెయింట్ మార్క్స్ సెంటినరి లూథరన్ చర్చి ఆడ్‌హాక్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకిలో అదరగొట్టిన విద్యార్థుల ప్రతిభ!

**- మండల స్థాయి పోటీల్లో పందిళ్ళపల్లి జట్టుకు ప్రథమ స్థానం**
**- జిల్లా స్థాయి పోటీలకు విజేతల ఎంపిక.. శాస్త్రీయ దృక్పథమే లక్ష్యం**

**వేటపాలెం, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చెకుముకి' సైన్స్ సంబరాల్లో భాగంగా శుక్రవారం వేటపాలెం మండల స్థాయి ప్రతిభా పరీక్ష ఉత్సాహభరితంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని 12 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు జట్లుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.మండల విద్యాశాఖ అధికారి కె. శ్రీనివాసరావు, వేటపాలెం, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, గుమ్మా శ్రీనివాసరావు 'చెకుముకి ప్రతిభా పరీక్ష' ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు.పోటీల్లో పందిళ్ళపల్లి హైస్కూల్‌కు చెందిన రామ్ చరణ్, షణ్ముఖేశ్వర్, కోమలి బృందం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. వేటపాలెం, దేశాయిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి 'చెకుముకి' సైన్స్ సంబరాల్లో పాల్గొననున్నారు. విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాలను తొలగించడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, భవిష్యత్తులో శాస్త్రవేత్తలను తీర్చిదిద్దడం లక్ష్యంగా 'చెకుముకి' సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక నాయకులు కనపర్తి మాల్యాద్రి తెలిపారు.కార్యక్రమంలో మండల జనవిజ్ఞాన వేదిక నాయకులు కాల్వ సోమశేఖర్, ఉమ్మిటి దక్షిణామూర్తి,



ఏ.వి. సుబ్బారావు, ఎన్. రాంబాబు, బి. నీలిమ, మీరా గురుమని, పి. పోతురాజుతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటోనగర్ లో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
ఆటోనగర్ లో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటిక ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్ లోని హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. శ్మశాన వాటికలకు వెళ్లే రహదారి నిర్మాణానికి తగిన అంచనాలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీంతోపాటు శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లు వెచ్చించామని, అన్నిరోడ్లకు మహర్దశ తీసుకొస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం తట్టమట్టి కూడా



వేయడానికి చేతగాని నాయకులు.. ఇప్పుడు మాట్లాడటం దారుణమన్నారు. ఆటోనగర్ లో ప్రతి రోజూ సుమారు 20 వేల మందికిపై కార్మికులు పని చేస్తుంటారని, దీని దృష్ట్యా అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలో ప్రభుత్వం నుంచి ఆమోదం తెలిపిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ మంచినీటి పైపు కనెక్షన్ ను అతి తక్కువ ధరకే అందించాలని గుంటూరు మునిసిపాలిటీకి ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరువ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నూతన పింఛన్ల మంజూరుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. నగరంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాన్ని సమర్థవంతంగా చేపట్టడంతోపాటు ఆహ్లాదానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. పార్కులు, వాకింగ్ ట్రాక్ ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను బలపరచడం ద్వారా గుంటూరు నగర అభివృద్ధిని మరింత మెరుగ్గా సాధించేందుకు వీలుంటుందని చెప్పారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 11,**
ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలోని 60 పాఠశాలలకు చెందిన 25,000 మందికి పైగా విద్యార్థులు ఒకే వేదికపైకి వచ్చి పర్యావరణహిత మట్టి, విత్తనాలతో గణేష్ విగ్రహాలను తయారు చేయడం విశేషంగా నిలిచిందని,పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయాల పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ప్రసిద్ధ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం గుంటూరు నగరానికి గర్వకారణమని, వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విద్యార్థులు చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాయుతమైన ఆలోచనలను అలవర్చుకోవడం అభినందనీయమనని,నేటి విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడం ద్వారా రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని సమాజాన్ని అందించవచ్చని అన్నారు.25,000 మందికి పైగా విద్యార్థులను ఒకే కార్యక్రమంలో భాగస్వాములను చేసి, కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' పోటీలో, వాయు కాలుష్య నియంత్రణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా 2వ స్థానాన్ని సాధించిన గుంటూరు నగరాన్ని నిలిపి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ కి , మున్సిపల్ అధికారులకు,హాజరైన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని,గుంటూరు నగరాన్ని పచ్చని నగరంగా, పరిశుభ్రమైన నగరంగా, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని



ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్ ,గల్లా మాధవి , మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ మన్నవ మోహన్ కృష్ణ , గాదె వెంకటేశ్వరరావు , వేలాది మంది విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పందిళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో ఘనంగా హిందీ దినోత్సవం

**- విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: ప్రధానోపాధ్యాయురాలు దీప్తి**

**- పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

**పందిళ్లపల్లి, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
సెప్టెంబర్ 14 జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు శంఖం లలితా పరమేశ్వరి, బుద్ధి ప్రసన్నాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన టీ.ఎల్.ఎం. ప్రదర్శన ఆకట్టుకుంది.ప్రధానోపాధ్యాయురాలు తలమల దీప్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హిందీ కవులు, కవయిత్రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అనేక భాషలను





నేర్చుకోవడం ద్వారా భాషా నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించవచ్చన్నారు. హిందీ ఉపాధ్యాయురాలు లలితా పరమేశ్వరి మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యతను వివరించి, హిందీని గౌరవిస్తూ నిత్య జీవితంలో వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు బుద్ధి ప్రసన్నాంజనేయులు హిందీ అభివృద్ధికి బ్యోహార్ రాజేంద్ర సింగ్ చేసిన కృషిని వివరించారు.అనంతరం విద్యార్థులకు దోహా, హిందీ క్విజ్, భాషణ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, హిందీ డిక్షనరీలు, హిందీ కథల పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. విద్యార్థులు ప్రముఖ కవులు, కవయిత్రుల వేషధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులు నృత్యాలు ప్రదర్శించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీడీలు, నాన్‌టీచింగ్, ఒకేషనల్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# రూ.79 లక్షలతో నూతన రహదారి నిర్మాణం - అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే మాలకొండయ్య



చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :చీరాల మున్సిపాలిటీ 31వ వార్డులో కారంచేడు రోడ్డు నుంచి సెయింట్ ఆన్స్ స్కూల్ వరకు రూ.79 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రహదారిని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు.ప్రజలు అందించిన ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చీరాల పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్ద కొదమగుండ్ల లైన్మెన్ గోపాల్ ఆకస్మిక మృతి





**పెన్ పవర్ కారంపూడి సెప్టెంబర్ 12 :---**
దుర్గికి చెందిన విద్యుత్ శాఖ లైన్మెన్ గోపాల్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా గుండె పోటు తో మృతి చెందాడు.
2004లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రస్తుతం కారంపూడి మండలం పెద్ద కొదమగుండ్ల గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు.గ్రామం లో మూడు సంవత్సరాల నుండి గ్రామంలో సేవలందిస్తున్నారు.విధి నిర్వహణలో అందరి ఆదరాభిమానాలు పొందారు. మాచర్ల డీఈ సింగయ్య, ఏడీఈ ఆనందరావు భౌతికకాయానికి నివాళులర్పించి, అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబానికి రూ.25 వేలు సాయం అందజేశారు. మృతి చెందిన లైన్మెన్ గోపాల్ కుటుంబానికి విద్యుత్ శాఖ వారు అండగా ఉంటామంటూ కుటుంబానికి భరోసా కల్పించారు. లైన్మెన్ గోపాల్ కుటుంబంలో ఒకరికి విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. యూనియన్ నాయకులు, సభ్యులు నివాళులర్పించారు.

# హిందీ భాషా దినోత్సవ వేడుకల్లో వేటపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల సందడి

- దేశభక్తి గీతాలు, నృత్యాలు, స్కిట్లతో ఆకట్టుకున్న విద్యార్థులు
- బెస్ట్ మ్యూజిక్ టీచర్ ఎం.సునీతకు ఘన సత్కారం



**వేటపాలెం, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
వేటపాలెం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని రిబ్బన్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ పటాలను ప్రదర్శించారు.జాతీయ సమైక్యత, దేశభక్తిని ప్రతిబింబించే హిందీ నృత్యాలు, పాటలు, స్కిట్లు, హిందీ భాష అభివృద్ధికి కృషి చేసిన మహనీయుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందీ భాష ప్రాధాన్యత, జాతీయ సమైక్యతలో దాని పాత్రను ఉపాధ్యాయినీలు పద్మ, హితవచనం విద్యార్థులకు వివరించారు.
ఇటీవల జిల్లా స్థాయిలో బెస్ట్ మ్యూజిక్ టీచర్గా అవార్డు పొందిన ఎం. సునీతను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# విద్యార్థుల చేతుల్లో పర్యావరణహిత వినాయకులు

- పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్లో వినూత్న కార్యక్రమం
- మట్టి వినాయకుల తయారీపై విద్యార్థులకు అవగాహన



**పందిళ్ళపల్లి, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
వినాయక చవితిని పురస్కరించుకుని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీమతి ఎన్. రూపకళ, సీహెచ్. భవానీదేవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి పర్యావరణంలో సులభంగా కరగని పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో మట్టి వినాయకులను తయారు చేయించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకులను ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి తలమల దీప్తి, ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులందరితో ప్రకృతి ప్రార్థన చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీని జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ గా మార్చాడు : ప్రత్తిపాటి

- ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నివేదికలు..
  హైకోర్టు తీర్పులపై జగన్ మౌనం ఉద్దేశపూర్వకమా..లేక అర్థాంగీకారమా? : ప్రత్తిపాటి
- ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు
  అప్పగించినా నాడు జగన్ నోరెత్తలేదు : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**
కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించిన మెగా డీఎస్సీపై అదేపనిగా బురదజల్లుతున్న జగన్.. తన హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై ఎందుకు నోరెత్తడం లేదు? ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ సర్వీస్ గా మార్చాడు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన డిజిటల్ వాల్యూయేషన్ పై జగన్ ఎందుకు స్పందించడం లేదు? ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు అప్పగించిన అధికారులపై నాడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి ఎంపిక చేసిన 450కి పైగా ప్రొఫెసర్లను కాదని, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, క్లర్క్ లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో గ్రూప్-1 పత్రాల మూల్యాంకనం చేయించడం ఎంత తప్పో జగన్ కు తెలియదా? ఏపీపీఎస్సీ పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూముల నుంచి హాయ్ ల్యాండ్ కు తరలించి ఏకంగా 82 రోజుల పాటు మూల్యాంకనం చేయడంలో తన ప్రమేయం లేదని జగన్ చెప్పగలడా? ఒకటీ.. రెండూ కాదు.. 48వేల ఓఎమ్ఆర్ షీట్లు పునర్ ముద్రించడం అనేది తప్పుడు పని కాదా? ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నివేదికలు, హైకోర్టు తీర్పులపై జగన్ మౌనం.. ఉద్దేశపూర్వకమా లేక అర్థాంగీకారమా? వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్ సహా, ఇతర సభ్యులందరూ ఆనాడు అడ్డగోలుగా అనైతిక చర్యలకు పాల్పడ్డారు. ఒక్కొక్కరు లక్షల జీతాలు తీసుకుంటూ కూడా, భత్యాల కోసం తప్పుడు బిల్లులు పెట్టి, ప్రభుత్వ సొమ్మును దిగమింగినా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? తన కమీషన్లు తనకు ముట్టచెబుతున్నారనే జగన్.. వారిని చూసీచూడనట్టు వదిలేశాడు. ఏపీపీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చే క్రమంలో నాడు గౌతమ్ సవాంగ్ ఏకంగా అబద్ధాలతో న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించారు. ఈ అంశాలేవీ తమకు తెలియవన్నట్టు.. తమకేమీ సంబంధం లేదన్నట్టు జగన్, వైసీపీనేతలు సిగ్గులేకుండా కూటమి ప్రభుత్వంపై నిందలేస్తున్నారు. అత్యంత నిబద్ధత, నిజాయితీలతో 16,400 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ లపై బురదజల్లుతున్నారు. తన పాలనలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై స్పందించలేని అసమర్థుడు.. ఏ ముఖం పెట్టుకొని మెగా డీఎస్సీని తప్పుపడుతున్నాడు. " అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో నిలదీశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజల మధ్యే ప్రజాప్రతినిధి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్



**పెన్ పవర్ కృష్ణాజిల్లా పెనమలూరు సెప్టెంబర్ 11:**
ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల మధ్యే ఉండాలన్నదే తెలుగుదేశం పార్టీ విధానమని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు.తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వినతిపత్రాలను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరంగా ఉండే పరిస్థితి లేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలనే సంస్కృతిని పార్టీ ఆవిర్భావం నుంచే కొనసాగిస్తోందని తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజలకు, పాత్రికేయులకు అందుబాటులో ఉండే విధానానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అనంతరం చంద్రబాబు నాయుడు 'ప్రజల వద్దకు పాలన', 'జన్మభూమి' వంటి కార్యక్రమాల ద్వారా పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లారని వివరించారు.
ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారని, అయితే పెనమలూరు నియోజకవర్గంలో ఒక్క శుక్రవారానికే పరిమితం కాకుండా ప్రతిరోజూ ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాలయం అందుబాటులో ఉంటుందని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు లేదా సాయంత్రం 4 గంటలకు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. గ్రామాల్లో పర్యటనలు, ఇతర కార్యక్రమాలు ఉన్న సందర్భాల్లో ముందుగానే వాట్సాప్ సమూహాలు, సామాజిక మాధ్యమాల ద్వారా సమయాన్ని తెలియజేస్తున్నామని చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికకు చిట్ఫండ్ సంస్థల్లో డబ్బులు చెల్లించినప్పటికీ తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కొందరు ఫిర్యాదు చేశారని తెలిపారు. అలాగే స్థిరాస్తి వ్యాపారంలో స్థలం లేదా నివాస సముదాయం కొనుగోలు చేసి మోసపోయామని మరో వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై సంబంధిత డీఎస్పీతో నేరుగా మాట్లాడి బాధితుడి ఫిర్యాదును స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఎమ్మెల్యే వివరించారు.పెన్షన్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తులు, ఇతర ప్రజా సమస్యలపై కూడా ప్రజలు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేస్తున్నారని అన్నారు.
ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఒక వేదిక ఉండాలి. ప్రజలు చెప్పిన సమస్యకు పరిష్కారం చూపించే బాధ్యత ప్రజాప్రతినిధిగా తనపై ఉందని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

# రూ.249.50 కోట్లతో 22 కీలక ప్రాజెక్టులు ప్రారంభం మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబరు 11:**
రాష్ట్రంలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు రూ.1,272 కోట్లతో ఆరోగ్య వసతుల పనులు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం విజయవాడలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రూ.249.50 కోట్లతో పూర్తయిన 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీటిలో 10 అత్యవసర చికిత్స కేంద్రాలు, 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు.
డిసెంబరులో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులను అనుసంధానం చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,800 ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరు 17 నుంచి 'సేవా సంకల్ప్ అభియాన్'ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. రక్తదానం, ఆరోగ్యం, పరిశుభ్రత, సైబర్ మోసాలపై అవగాహన, అవయవదాన ప్రచారం తదితర 25 రకాల సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.



# ప్రజా దర్బార్లో ప్రజల గోడు.. 22 అర్జీల వెల్లువ!

- ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకే 16 వినతులు
- సీఎంఆర్ఎఫ్ సాయంతో పాటు ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కొండయ్య

**చీరాల, సెప్టెంబర్ 11,(పెన్ పవర్) :**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రజల నుంచి స్వయంగా వినతులు, అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 22 అర్జీలు అందాయి. వీటిలో ఇంటి నిర్మాణాలు, ఇంటి స్థలాలకు సంబంధించి 16, సీఎంఆర్ఎఫ్ సాయం కోసం 2, ఇతర సమస్యలపై 4 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, కాళహస్తి బోర్డు సభ్యురాలు కుమ్మరి బోయిన రజిని, పట్టణ అధ్యక్షుడు దోగుపర్తి సురేష్, నియోజకవర్గ అధ్యక్షురాలు లలిత, కర్ణ శ్రీనివాసరావు, జె ఎస్ పి నాయకుడు గూడూరు శివరాం ప్రసాద్, గ్లోబల్ ఎన్ఆర్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కల శివ నాగరాజు, నాగలక్ష్మి, పద్మిని, స్వాతి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు,పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
వినాయక చవితి సందర్భంగా గుంటూరు జిల్లాలో విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్స్టేషన్ ఎస్హెచ్ఓ అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు.మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు కనీసం ఐదుగురు సభ్యులతో తమ వివరాలు, గుర్తింపు కార్డుల ప్రతులను పోలీసులకు అందించాలి. ప్రైవేటు లేదా ప్రభుత్వ స్థలాల్లో మండపాల ఏర్పాటుకు సంబంధిత యజమాని, పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. విద్యుత్, అగ్నిమాపక శాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.
మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రాత్రివేళల్లో నిర్వాహకులు భద్రతా చర్యలు చేపట్టాలి. ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్స్పీకర్లు వినియోగించాలి. డీజేలు, మందుగుండు సామగ్రి, అసభ్య ప్రదర్శనలు, మద్యం వినియోగం పూర్తిగా నిషేధం.నిమజ్జన ఊరేగింపులో ఇతర మతాలు, కులాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదని, పోలీసుల అనుమతించిన మార్గం, సమయం మాత్రమే పాటించాలని ఎస్పీ సూచించారు. చిన్నారులు, మైనర్లు, మద్యం సేవించిన వారిని నిమజ్జన వాహనాల్లో తీసుకెళ్లరాదని తెలిపారు. ట్రాఫిక్, భద్రత కోసం తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.





# చిల్డ్రన్ పార్కుకు మహర్దశ..!

- రూ.50 లక్షలతో ఆధునిక సౌకర్యాల ఏర్పాటు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొండయ్య -ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటస్థలం, లైటింగ్తో సరికొత్త రూపు ప్రజల ఆరోగ్యమే లక్ష్యమన్న ఎమ్మెల్యే



**చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్)**
:చీరాల మున్సిపాలిటీ 8వ వార్డులోని డి.రామానాయుడు చిల్డ్రన్ పార్కు అభివృద్ధి పనులకు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.50 లక్షల వ్యయంతో పార్కులో ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.పార్కులో నూతనంగా ఓపెన్ జిమ్ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు, వాకింగ్ పాత్వే, లైటింగ్ సదుపాయాలను కల్పించనున్నారు. పిల్లలు, వృద్ధులు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడేలా పార్కును అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.పచ్చదనంతో పాటు ఆధునిక సౌకర్యాలతో పార్కును తీర్చిదిద్దాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పార్కు అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు
- ఉమ్మడి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల స్పందన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం
- నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



**నరసరావుపేట,పెన్ పవర్ సెప్టెంబర్ 11:**
ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు నరసరావుపేట నియోజకవర్గంలో చేపట్టిన రెండేళ్ల నమ్మకంఅభివృద్ధిసంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం శుక్రవారం 7వ వార్డులో కొనసాగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఆయా పథకాల ద్వారా తమకు ప్రయోజనం అందుతోందా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తలతో పాటు మహిళలు, మైనారిటీ సోదరులు అందించిన సహకారం మరువలేనిదని అరవిందబాబు పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ కష్టకాలంలో తనకు అండగా నిలిచిన మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల్లో చిన్నచిన్న లోపాలు, సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా పెన్షన్లకు అవకాశం కల్పించామని, అర్హులైన వారు ఎన్టీఆర్ భరోసా, దివ్యాంగుల, ఆరోగ్య సంబంధిత పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధి, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగంలో ప్రజలు, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టు పరిధిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో సమయపాలన పాటించాలని రైతులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావాలి, 7వ వార్డు ఇంచార్జ్ షేక్ నాగుర్, నాయకులు షేక్ నాగుర్ భాష, పి. రాయప్ప, షేక్ శుభాని, మాతంగి బంగారం, సయ్యద్ జానీ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పేటలో రోడ్డు ప్రమాదాల నివారణపై సీఐ రమేష్ ప్రత్యేక దృష్టి

## ప్రధాన కూడళ్లలో అధికారులతో కలిసి విస్తృత పరిశీలన.. భద్రతా చర్యలకు కార్యాచరణ

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**
చిలకలూరిపేట: పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై టౌన్ సీఐ రమేష్ ప్రత్యేక దృష్టి సారించారు. గత నెలాఖరున పురుషోత్తపట్నం అడ్డరోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు.ఇందులో భాగంగా సెప్టెంబర్ 11న పల్నాడు జిల్లా ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, స్థానిక ఎంవీఐలతో కలిసి పాత జాతీయ రహదారిపై ఉన్న ఎన్ఆర్టీ సెంటర్, అడ్డరోడ్డు, విజయా బ్యాంక్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, ఏఎంసీ చెక్‌పోస్టు తదితర ప్రధాన కూడళ్లను పరిశీలించారు.ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సీఐ రమేష్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు 3 లేయర్ల స్పీడ్ బ్రేకర్లు, ఎస్-టైప్ బ్యారికేడ్లు, రోటరీ ట్రాఫిక్ సిగ్నల్స్, ఆబ్జెక్ట్ హజార్డ్ మార్కింగ్స్, ఓహెచ్ఎంఎస్, టీఎంబీ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్పష్టమైన రోడ్ మార్కింగ్స్ వేయాలని నిర్ణయించారు.ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను త్వరలోనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ తెలిపారు. పోలీస్, ట్రాఫిక్,



రవాణా, ఎన్‌హెచ్‌ఏఐ శాఖల సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, ప్రజల ప్రాణాలకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విజయవాడ , పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు హాజరయ్యారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ నేరాల కట్టడి తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు.అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం, నేరాల దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ఫోరెన్సిక్ సేవలను విస్తృతంగా వినియోగించడం, పోలీసుల స్పందన వేగాన్ని పెంచడం, నేరాల్లో దోషులకు శిక్ష పడేలా దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి కన్విక్షన్ రేట్ పెంచడంపై కలెక్టర్లు, ఎస్పీలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేలా పోలీసు, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు.

# ఆటో నుండి పడి వ్యక్తి మృతి..

## - వంకాయలపాడు వద్ద ఘటన



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**
ఎడ్లపాడు: ప్రయాణికుల ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ఆటో నుండి కిందపడిపోయి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన శుక్రవారం ఎడ్లపాడు మండలంలో చోటుచేసుకుంది.గుంటూరు నుంచి ఎడ్లపాడు వైపు వస్తున్న ప్యాసింజర్ ఆటో వంకాయలపాడు గ్రామం దాటిన అనంతరం సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ క్రమంలో డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.వెంటనే స్పందించిన ఆటో డ్రైవర్ షఫరుద్దీన్ 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పరిశీలించి, వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చీరాల 3వ వార్డులో రూ.15 లక్షలతో డ్రైనేజీ కాలువలు

- ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే మాలకొండయ్య
- ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి అభివృద్ధికి ప్రాధాన్యత



**చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
చీరాల మున్సిపాలిటీ 3వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సైడ్ డ్రైనేజీ కాలువలను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణం ద్వారా ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రజలు అందించిన ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చీరాల పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై వికృత చేష్టలు.. నిందితుడికి 5 ఏళ్ల జైలు

- రూ.6 వేల జరిమానా.. బాధితురాలికి రూ.10 వేల పరిహారం
- సమర్థవంతమైన దర్యాప్తు, ట్రయల్ మానిటరింగ్‌తో నిందితుడికి శిక్ష : ఎస్పీ ఉమామహేశ్వర్

**పర్చూరు, సెప్టెంబర్ 11(పెన్ పవర్) :**
మైనర్ బాలికపై వికృత చేష్టలకు పాల్పడిన నిందితుడికి ఒంగోలు ప్రత్యేక పి ఓ సి ఎస్ ఓ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6 వేల జరిమానా విధించింది. పర్చూరు మండలం పోతుకట్ల గ్రామంలో 2023లో జరిగిన ఘటనకు సంబంధించి నాదండ్ల వెంకట స్వామి (56)కి ఈ శిక్ష పడింది. బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. 2023 సెప్టెంబర్ 26న తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికకు పప్పులు, చాక్లెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి నిందితుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారి ఫిర్యాదు మేరకు పర్చూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
దర్యాప్తులో భాగంగా బాలిక, ఫిర్యాదుదారు, ఇతర సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి, నేరస్థలం నుంచి భౌతిక ఆధారాలను సేకరించారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో సాక్షులు నిర్భయంగా వాంగ్మూలాలు ఇచ్చేలా పోలీసులు సమన్వయం చేయడంతో పాటు కోర్టు ట్రయల్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించారు. ప్రత్యేక పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావు కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించారు.
సాక్షుల వాంగ్మూలాలు, దర్యాప్తులో సేకరించిన భౌతిక ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కె.శైలజ శుక్రవారం నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వేగవంతమైన దర్యాప్తు, నిర్ణీత గడువులో ఛార్జ్‌షీట్ దాఖలు, నిరంతర కోర్టు ట్రయల్ మానిటరింగ్ వల్లే నిందితులకు శిక్షలు పడుతున్నాయని తెలిపారు. మహిళలపై నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టితో 'ఆపరేషన్ దండాయన' కార్యక్రమం ద్వారా చర్యలు



కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్టు, భౌతిక ఆధారాల సేకరణ, కోర్టు ట్రయల్ మానిటరింగ్‌లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పీపీని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

# గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

**పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 11**
గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేకంగా స్త్రుఅవంష్ట్రబ్యిఖజ.అవ్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందని పెడన ఎస్సై గంట్ల సత్యనారాయణ తెలిపారు. పెడన పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. అనుమతుల కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం పోలీసులు మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తారని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు ఞ= కోడ్‌తో కూడిన చీూజ జారీ చేస్తారని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కోరారు.




# వినాయక చవితి వేడుకల్లో డీజేలకు నో!

- నిబంధనలు ఉల్లంఘిస్తే పరికరాలు సీజ్.. నిర్వాహకులు, ఆపరేటర్లపై కేసులు
- రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదు: అడిషనల్ ఎస్పీ సుధాకర్

**చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
వినాయక చవితి వేడుకలు, విగ్రహాల ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ సుధాకర్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ జారీ చేసిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. శుక్రవారం చీరాల ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ లో డీజే ఆపరేటర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో నిర్వహించాలని, శబ్ద కాలుష్యానికి తావులేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులు,



డీజే ఆపరేటర్లపై ఉందన్నారు. ఊరేగింపులు, మండపాల వద్ద అధిక శబ్దంతో కూడిన డీజే సిస్టమ్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు.సుప్రీంకోర్టు, ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులకు లోబడి సౌండ్ లిమిట్ తో కూడిన బాక్స్ స్పీకర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలాంటి మైక్ లేదా సౌండ్ సిస్టమ్‌ను వినియోగించరాదని స్పష్టం చేశారు. డీజేలకు బదులుగా సంప్రదాయ వాయిద్యాలు, మంగళ వాయిద్యాలను ప్రోత్సహించాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే పరికరాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులు, ఆపరేటర్లపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని అడిషనల్ ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్న వారికి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో చీరాల డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, డీజే ఆపరేటర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు : రూ. 8.79 లక్షల జరిమానా



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**
విద్యుత్ అక్రమ వినియోగంపై ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం చిలకలూరిపేట టౌన్ సెక్షన్ పరిధిలో విజిలెన్స్ ఎస్ఈ కె.వి.ఎల్.ఎన్. మూర్తి, సీఆర్డీఏ ఎస్ఈ బి.వి. సుధాకర్ ఆధ్వర్యంలో 34 మంది అధికారులు, 85 మంది సిబ్బందితో కూడిన 34 ప్రత్యేక బృందాలు 1,885 సర్వీసులను విస్తృతంగా తనిఖీ చేశాయి. ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరికి రూ. 0.35 లక్షలు, కేటగిరి మార్చి వాడుతున్న ముగ్గురికి రూ. 0.40 లక్షలు, అనుమతించిన లోడ్ కంటే అదనంగా వాడుతున్న 111 మందికి రూ. 8.04 లక్షలు.. ఇలా మొత్తంగా రూ. 8.79 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఈఈలు సీహెచ్. వెంకటేశ్వరరావు, వై. ఏడుకొండలు సంయుక్త ప్రకటనలో తెలిపారు.విద్యుత్ మీటర్లకు సీళ్లు లేకపోయినా, ఉద్దేశపూర్వకంగా తొలగించినా విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం విద్యుత్ చౌర్యంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. రెండవసారి తప్పు చేస్తే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని, జరిమానా చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తులు జప్తు చేస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, ఎక్కడైనా చౌర్యం జరుగుతున్నట్లు గుర్తిస్తే 9440812263, 9440812360 నంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వారు కోరారు. ఈ దాడుల్లో ఆపరేషన్ మరియు విజిలెన్స్ విభాగాలకు చెందిన డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఘనంగా మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

## - 22 పాఠశాలల నుంచి విద్యార్థుల హాజరు విజేతలకు బహుమతులు



**ఆత్మకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 11.**
విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు మూఢనమ్మకాలు, ఛాందస భావాలను నిర్మూలించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.ఆత్మకూరు మండలంలోని ఎల్.ఆర్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఆగస్టు 27న నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో మండలంలోని 22 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 1,400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.మండల స్థాయి పోటీ ప్రారంభంలో ఎల్.ఆర్.పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కావాటి సురేష్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అసోసియేట్ సభ్యులు వంటేరు మల్లికార్జునరావు, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి సుంకు మురళీకృష్ణ, రిటైర్డ్ డైట్ ఉపన్యాసకులు, జేవీవీ సీనియర్ నాయకులు కె. సుధాకర్ రావు, జేవీవీ సీనియర్ నాయకులు ఎస్కే సంధాని, బడుగు శ్రీనివాసులు, సాధిక్ హుస్సేన్, ఎండి మహమ్మద్, పార్లపల్లి సుధాకర్ రావు, యూటీఎఫ్ నాయకులు బి. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆలోచనా విధానం, మూఢవిశ్వాసాల నిర్మూలన, ప్రకృతిపర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావం, సమాజంలో సంస్థ చేపడుతున్న వివిధ ప్రజోపయోగ కార్యక్రమాలను వివరించారు.

**విజేతలు వీరే**

మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్కే హబీబా సుల్తానా, కె. జశ్విత, ఎం. తేజశ్రీ విజేతలుగా నిలిచారు.ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీమన్నారాయణ ఈఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు లాస్యశ్రీ, సుష్మజ, రమ్యశ్రీ విజయం సాధించారు.విజేతలైన ఆరుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీరు ఈ నెల 27న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆత్మకూరు మండలం తరఫున పాల్గొననున్నారు.ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో చెర్లో ఎడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహిమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, నలంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల కార్యవర్గ సభ్యులతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసన ప్రమాణాలపై పరిశీలన

**పెడన,పెన్ పవర్, సెప్టెంబర్ 11**
పెడన పట్టణంలోని ప్రభుత్వ రాంజీ ఉన్నత పాఠశాలలో ఉదయం పాఠశాల విధులు నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం 18వ వార్డు ఇందిరా కాలనీలోని ఎంపీపీ పాఠశాలను విద్యాశాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్‌బుక్‌లలో ఉపాధ్యాయులు చేపడుతున్న దిద్దుబాటు ప్రక్రియను, విద్యార్థుల అభ్యసన ఫలితాలను పరిశీలించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అభ్యసన ప్రమాణాలను పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



# డుమ్మాకొట్టిన ఐఏఎస్ అధికారులు...
# సీఎం చంద్రబాబుకు షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధాని అమరావతిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి 28 జిల్లాల కలెక్టర్లతోపాటు సెక్రటరీలు, ఉ్నణలు హాజరు కావాల్సివుంది. అయితే కొందరు ఐఏఎస్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు కావడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గమనించారు. తన ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుంటే ఐఏఎస్ అధికారులు ఎలాంటి అనుమతి లేకుండా డుమ్మా కొట్టడంపై సీరియస్ అయ్యారు. ఏం తమాషానా? అంటూ గైర్హాజరు అయిన అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్ ను ఆదేశించారు.దముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సుకు కొందరు సీనియర్ అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో కొందరు అధికారులు లేకపోవడాన్ని సీఎం గమనించారు. ఒకరిద్దరు ఇతర పనులతో రాలేకపోయినట్లు సీఎస్ వివరించారు. అదేసమయంలో సమాచారం ఇవ్వకుండా ఉండిపోయిన అధికారుల విషయంలో మౌనం వహించారు. దీంతో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన సమావేశానికి బాధ్యత గల అధికారులు రాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. వాట్సాప్ మెసేజులపై చూపిస్తున్న శ్రద్ధ ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో చూపడం లేదని సీఎం మండిపడ్డారు. కలెక్టర్ల సమావేశానికి ఫోన్లు లేకుండా రావాలని తాను ముందే చెప్పానని సీఎం వ్యాఖ్యానించారు. అయినప్పటికీ చాలా మంది అధికారులు ఫోన్లు తీసుకుని రావడం, సమావేశ మందిరం బయట తమ సిబ్బందికి అప్పగించి మాటమాటకి వాట్సాప్ మెసేజులను చూసుకోవడానికి బయటకు వెళుతుండటం సీఎం ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాను ఎంతో ఓపికగా సమావేశం కొనసాగిస్తుంటే, కలెక్టర్లు కనీసం 12 గంటలు కదలకుండా కూర్చోలేకపోతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాగా, కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయడంపై విస్తృత చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు సీఎంతోపాటు మంత్రులు, ఆయా శాఖల విభాగాధిపతులు, కలెక్టర్లు హాజరు అవుతారు. అయితే గతంలో లేనట్లు ఈ సారి సమావేశాలకు ఫోన్లు తేవొద్దని సీఎం ముందే ఆదేశించారు. అయినప్పటికీ అధికారిక విధులలో బిజీగా ఉండే అధికారులు తమతో ఫోన్లు తీసుకురావడం తప్పనిసరిగా మారిందని అంటున్నారు.

అర్జంటు సమాచారం, ఇతర అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు అన్నీ ఫోన్లలో జరుగుతున్న సమయంలో ఫోన్ లేకుండా ఎలా? అని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫోన్లు వెంట ఉండటం వల్ల అధికారులు తాను చెప్పే అంశాలపై శ్రద్ధ వహించలేకపోతున్నారని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. ఇక సమావేశానికి ఫోన్లు తీసుకురావడం, ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో ఎక్కువ సమయం తీసుకోవడంపై సీఎం అసంతృప్తికి లోనరయ్యారని అంటున్నారు. దీంతో సమావేశంలోనే అందరినీ హెచ్చరిస్తూ డుమ్మా కొట్టిన వారి పేర్లు చదివి హెచ్చరికలు పంపారని అంటున్నారు. ఇక మంత్రులు కూడా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని మందలించారు.

# చిన్న శ్రీను చేరిక.. టీడీపీలో వారికి ఇష్టం లేదు!!



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మను, వైసీపీ కీలక నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడం ఆ పార్టీలో విస్తృత చర్చకు దారితీస్తోంది. చిన్న శ్రీనుతో ఇప్పటివరకు యుద్ధం చేసిన వారిలో ఎక్కువ మంది ఆయన పార్టీలో రాకను జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. అలా అని అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించలేక తీవ్ర అంతర్మథనానికి లోనవుతున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా జడ్పీ చైర్మనుగా సర్వం తానై రాజకీయం నడిపిన చిన్నశ్రీనుతో టీడీపీకి చెందిన అనేక మంది నాయకులు నువ్వా-నేనా అన్నట్లు తలపడ్డామని, పరస్పర విమర్శలతో గత ఎన్నికల్లో చిన్నశ్రీనును నైతికంగా ఓడించామని చెబుతున్నారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు తమ పక్కన కూర్చోబెట్టుకుని ఎలా సమర్థించాలో అర్థం కావడం లేదని పలువురు టీడీపీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా ప్రకటించిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను ఆ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ప్రత్యక్షమై అందరికీ షాక్ ఇచ్చారని అంటున్నారు. తాను వైసీపీని వీడుతానని కానీ, టీడీపీలో చేరతానని కానీ ఏ ఒక్కరికి ముందుగా చెప్పని చిన్న శ్రీను అత్యంత రహస్యంగా వ్యవహరించి ఆఖరి నిమిషంలో తన వ్యూహాన్ని బయటపెట్టారని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి నివాసానికి చిన్న శ్రీను చేరుకుంటారని నిర్ధారించుకున్న కాసేపటికే జిల్లాలో ప్రజాప్రతినిధులు, సీనియర్లకు సమాచారం ఇచ్చారని అంటున్నారు. అంతేకాకుండా జిల్లా నేతలు అంతా మంగళగిరిలో నిర్వహిస్తున్న లీడర్ షిప్ సమ్మిట్ లో ఉండటంతో అందరినీ ముఖ్యమంత్రి నివాసానికి రావాల్సిందిగా ఆదేశించారని అంటున్నారు.ఇక సీఎం కార్యాలయ సిబ్బంది సూచనలతో ఉండవల్లిలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన తర్వాత అక్కడ చిన్నశ్రీనును చూసిన పార్టీ నేతలు షాక్ కు గురయ్యారని చెబుతున్నారు. అప్పటికి కొద్దిసేపటి క్రితమే ఆయన పార్టీలో చేరతారని సమాచారం ఇచ్చి, ఆ వెంటనే కండువా కప్పేలా జరిగిన ఏర్పాట్లు చూసి టీడీపీ సీనియర్లు ఆశ్చర్యపోయారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీలో చేరికలను ప్రోత్సహించాల్సివున్నప్పటికీ జిల్లా స్థాయి నేత పార్టీలోకి వచ్చేముందు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని కొందరు నేతలు అంతర్గత సంభాషణల్లో నొచ్చుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది.విజయనగరం జిల్లాలో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా చిన్నశ్రీను సుదీర్ఘంగా రాజకీయం నడిపారు. కాంగ్రెస్, వైసీపీ పార్టీల తరఫున తెరముందు బొత్స, ఆయన సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు రాజకీయం చేస్తే వారందరికీ వెన్నుదన్నుగా నిలుస్తూ తెరవెనుక చక్రం తిప్పి, వారి విజయానికి తగిన వ్యూహాలు రచించడం చిన్నశ్రీను చూసేవారని చెబుతున్నారు. అయితే బొత్స కుటుంబ రాజకీయం ఇలా కొనసాగినంత వరకు చిన్నశ్రీనుతో టీడీపీకి పెద్దగా ఇబ్బంది లేదని అంటున్నారు. కానీ, 2021లో ఆయన జడ్పీ చైర్మనుగా తెరముందుకు వచ్చిన తర్వాత రాజకీయం పూర్తిగా మారిపోయిందని అంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అనుసరించిన విధానాలనే చిన్న శ్రీను కూడా విజయనగరంలో అమలు చేయడంతో రాజకీయ కక్ష సాధింపులు ఎక్కువగా సాగాయని, తమ కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని టీడీపీలోని కొందరు నేతలు ఎత్తిచూపుతున్నారు. అంతేకాకుండా పలువురు టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పోస్టుల ద్వారా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. సామాజిక, రాజకీయ సమీకరణాల పేరుతో ప్రత్యర్థులను పార్టీలోకి తేవడం వల్ల సొంత కేడర్ నష్టపోతుందన్న విషయాన్ని పార్టీ అధిష్టానం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

కాగా, చిన్నశ్రీను చేరికను టీడీపీలో జిల్లాస్థాయి నేతలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కొందరు నేతలు మాత్రం స్వాగతిస్తున్నారని అంటున్నారు. చిన్నశ్రీనును తీసుకోవడం వల్ల వైసీపీ వెన్నుముక విరిచేసినట్లైందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం జిల్లాలో ఉన్న నేతల్లో దూకుడుగా రాజకీయం చేసే నేతలు తక్కువగా ఉన్నారని, ఉన్న ఒకరిద్దరికి చిన్నశ్రీను జత కలిస్తే భవిష్యత్తులో పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్న వారు సైతం ఎక్కువగానే ఉన్నారంటున్నారు. ఇప్పటివరకు జిల్లాకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా వెళ్లిపోవడం, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఇప్పటికీ జిల్లాపై పట్టుసాధించలేకపోవడం వల్ల చిన్న శ్రీను రాక కలిసివస్తుందని మరికొందరు సమర్థిస్తున్నారు. మొత్తానికి చిన్న శ్రీను టీడీపీ కండువా కప్పుకోవడంపై ఆ పార్టీలో రెండు రోజులుగా వాడివేడి చర్చలు కొనసాగుతూనే ఉన్నాయని అంటున్నారు.

# కాలుష్య నియంత్రణలో ఢిల్లీ బెస్ట్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:**
రాజధాని ఢిల్లీతో పోటీ పడడమే కాదు బెస్ట్ ర్యాంక్ ని విశాఖపట్నం అందుకుంది. దేశ రాజధానితో సమానంగా విశాఖ పెర్ఫార్మెన్స్ చేయడం ఇక్కడ విశేషం. ఏ విషయంలో అంటే కాలుష్య నియంత్రణలో. పకడ్బందీగా చర్యలు తీసుకుని విశాఖ దేశంలోనే మంచి ర్యాంక్ ని అందుకుంది. అలాగే ఢిల్లీ తో కలసి 21వ ర్యాంక్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో ఢిల్లీ విశాఖ 21వ ర్యాంక్ ని కలిసి పంచుకున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకులలో విశాఖ ఈ విధంగా ఇంట్రెస్టింగ్ రిజల్ట్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకులలో లక్నోకు అగ్ర స్థానం దక్కింది. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో నంబర్ వన్ గా నిలిచింది. అలాగే ఇండోర్ రెండో స్థానంలో ఉంటే 195 పాయింట్లతో జబల్‌పూర్ మూడో స్థానంలో ఉంది. ఇక ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గత ఏడాది ఢిల్లీ 32వ స్థానంలో ఉంది. అయితే ఈసారి ఢిల్లీ తన ర్యాంకును మరింతగా మెరుగుపరుచుకోవడం విశేషంగా పేర్కొంటున్నారు. దేశంలో చూస్తే ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో ఉంటే పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.ఏమిటీ ర్యాంకులు వీటి వెనక కథ ఏంటి అంటే ఈ ర్యాంకులు అందుకున్న నగరాల్లో కాలుష్యం పూర్తిగా తొలగిపోయింది అని కాదు, అయితే కాలుష్యం విషయంలో ఈ నగరాలు తీసుకుంటున్న కీలక చర్యలు, రోడ్లపై దుమ్ము ధూళీ లేకుండా సక్రమంగా ఉంచడం, పేరుకుపోకుండా ఘన వ్యర్థాల తొలగింపు, వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వెదజల్లే ఉద్గారాలను వీలైనంత మేరకు తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, కాలుష్యం మీద ప్రజలలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను జాతీయ స్థాయిలో ప్రకటిస్తారు. ఈ నగరాలలో గాలి నాణ్యత తక్కువగా ఉండొచ్చు అయితే కాలుష్య నియంత్రణ చర్యలు బలంగా అమలు అవుతున్నందువల్ల ఏదో నాటికి నాణ్యమైన గాలి ఆ నగరాలకు దక్కుతుందని అంటున్నారు. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోంది నిజానికి ఢిల్లీ అంటేనే కాలుష్యం అని చెబుతారు. శీతాకాలంలో అయితే ఢిల్లీలో ఎవరూ ఉండలేని పరిస్థితి తలెత్తుతుంది. విపరీతంగా వచ్చే పొగమంచు అలాగే విషపూరితమైన గాలి ఉన్నప్పటికీ ఢిల్లీ కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు గొప్పగా ఉన్నాయని అంటున్నారు. దీని వల్ల ఢిల్లీ ఏదో నాటికి కాలుష్యం కోరల నుంచి బయట పడుతుంది అని అంటున్నారు. అలా పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. ఇక విశాఖ విషయం తీసుకుంటే అంతకంతకు ఈ నగరంలోనూ కాలుష్యం పెరిగిపోతోంది. అయితే దానిని నిరోధించేందుకు సరైన సమగ్రమైన చర్యలు చేపడుతూ విశాఖ కూడా దీ బెస్ట్ అనిపించుకుంటోంది. అందుకే మంచి ర్యాంక్ ని పొందింది అని అంటున్నారు.

## వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి.వైఎస్ఆర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం. బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

## వైసీపీకి జీవన్మరణ సమస్య

**విజయవాడ, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన ఒత్తిడికి, కంగారుకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాభవం నుంచి కోలుకోకముందే ఎదురవుతున్న స్థానిక పోరులో ఉనికి కాపాడుకోవడం ఆ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఈ క్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకత్వం శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాలను ఎంచుకోవడానికి బదులుగా, రక్తాభిషేకాలు, నరుకుతాం, చంపుతాం వంటి తీవ్రమైన ఆవేశపూరిత వ్యాఖ్యలతో క్యాడర్‌ను రగల్చే ప్రయత్నం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ ముఖ్య నేతలు వీధి పోరాటాల పేరిట ఇస్తున్న పిలుపులు, వాడుతున్న భాష క్షేత్రస్థాయి శ్రేణులను మరింత ఇరకాటంలో పడేస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో నమోదైన అక్రమ కేసులు, అధికార మార్పిడి తర్వాత చోటుచేసుకున్న చట్టపరమైన పరిణామాలతో ఇప్పటికే వందలాది మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి సున్నితమైన సమయంలో తిరగబడండి, తెగబడండి అంటూ నాయకత్వం ఇచ్చే ఆవేశపూరిత ఉపన్యాసాలు క్యాడర్‌ను శాంతింపజేయడానికి బదులు, మరిన్ని కొత్త కేసుల్లోకి నెట్టివేసే ప్రమాదం ఉంది.ఈ తరహా ఆవేశపూరిత రాజకీయం వెనుక వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన కంగారు, అభద్రతా భావం దాగి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై వేగంగా అడుగులు వేస్తుండటంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేదా ఏకపక్ష విజయాలు సాధిస్తే వైసీపీ క్యాడర్ పూర్తిగా ఖాళీ అయిపోతుందనే భయం ఆ పార్టీని వెంటాడుతోంది. ప్రజాదరణతో ఎన్నికలను ఎదుర్కోవడానికి తగినంత గ్రౌండ్ వర్క్ లేకపోవడంతో, ఘర్షణ పూరిత వాతావరణాన్ని లేదా సెంటిమెంట్‌ను రగల్చడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించడమో, లేదా వైలెంట్ నేరేటివ్‌తో ఉద్రిక్తతలు సృష్టించి ప్రభుత్వంపై వేధింపుల ముద్ర వేయడమో ఒకే ఒక్క మార్గంగా వైసీపీ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ తీవ్రమైన వ్యాఖ్యలు పార్టీకి మైలేజ్ ఇవ్వడం కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలు లేదా కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే, తమను ఆదుకోవడానికి ఏ సీనియర్ నాయకుడూ ముందుకు రాడనే నిజం ఇప్పటికే వైఎస్ఆర్‌సీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అర్థమైంది. నాయకులు మైకుల ముందు ఆవేశంగా మాట్లాడి వెళ్ళిపోతారు, కానీ చట్టపరమైన పరిణామాలు అనుభవించాల్సింది క్షేత్రస్థాయి కార్యకర్తలే. దాంతో నాయకత్వం ఎంత రగిల్చినా, క్యాడర్ మాత్రం మళ్లీ కేసులు కొనితెచ్చుకోవడానికి సిద్ధంగా లేదు. అంతిమంగా, హింస లేదా రెచ్చగొట్టే రాజకీయాలను నమ్ముకోవడం ద్వారా ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం నిలబడలేదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే దానికి చట్టపరంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎదురుతిరగాలి తప్ప.. నరకడం, చంపడం వంటి పదజాలంతో రాజకీయం చేస్తే పార్టీ మరింత బలహీనపడటంతో పాటు సామాన్య ప్రజల్లో మరింత వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుంది. స్థానిక పోరు వేళ వైఎస్ఆర్‌సీపీ అనుసరిస్తున్న ఈ ఆవేశపూరిత వ్యూహం పార్టీని పునరుద్ధరించడానికి బదులు, ఉన్న క్యాడర్‌ను కూడా దూరం చేసే ప్రమాదంలో పడేస్తోంది

## కాంగ్రెస్ కు దగ్గరవుతున్న జగన్



**కడప, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమంగా కాంగ్రెస్ అధిష్టానానికి దగ్గరవుతున్నారనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చలు జరిపారన్న కథనాలు రావడం, ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ కానీ, ఇటు వైఎస్ఆర్‌సీపీ కానీ స్పష్టంగా ఖండించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్న జగన్, సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ.. కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు , విశ్లేషకులు జగన్-కాంగ్రెస్ కలయిక పై కొత్త లాజిక్కులు తెరపైకి తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంక్ రాకపోయినా, ఓట్ల చీలిక వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలను కొంతవరకు దెబ్బతీసిందనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకి వచ్చినా లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వవచ్చని, కేంద్రంలోనూ బీజేపీకి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్‌కు రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ రాజకీయ పునరేకీకరణ వెనుక అతిపెద్ద అడ్డంకి వైఎస్ షర్మిల పాత్ర. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల.. వైఎస్ జగన్‌పై, ఆయన పాలనా శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఆస్తి వివాదాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయి. సయోధ్య కుదిరితే తప్ప కాంగ్రెస్-వైసీపీ మైత్రి సాధ్యం కాదనే వాదన ఒకవైపు ఉంది. కానీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు అన్నట్లుగా.. హైకమాండ్ ఆదేశిస్తే ఢిల్లీ పెద్దల సమక్షంలో కుటుంబ కలహాలను పక్కనబెట్టి ఒక అవగాహనకు వచ్చే అవకాశాలను కూడా కొట్టిపారేయలేము.వైఎస్ జగన్ ఈ దిశగా అడుగులు వేయడానికి మరో బలమైన కారణం --- కేంద్రంలోని అధికార పక్షం నుంచి గతంలో లభించినంత పొలిటికల్ రక్షణ ఇప్పుడు లభించడం లేదన్న భావన. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నమోదు అవుతున్న కేసులు, ఈడీ, సీబీఐ విచారణల వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రాంతీయంగా ఒంటరిపోరు చేయడం కంటే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జతకట్టడం ద్వారా వ్యూహాత్మక రాజకీయ రక్షణ దక్కుతుందనే ఆలోచనలో వైసీపీ అధినాయకత్వం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కేసీ వేణుగోపాల్‌తో నడిచిన ఈ చర్చలు కేవలం ఆరంభం మాత్రమేనా లేక పక్కా ప్రణాళిక ప్రకారం సాగుతున్న పొలిటికల్ మూవా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో చేతులు కలిపితే, అది ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ మార్పులకు దారితీస్తుంది.

# కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ.. ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

- ఇంగ్లండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుల్దీప్
- యార్క్‌షైర్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన వైనం
- బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్
- ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, కోచ్ గంభీర్‌కు గట్టి సందేశం
- భారత, ఇంగ్లండ్ పిచ్‌ల మధ్య ఉన్న తేడాను వివరించిన కుల్దీప్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. "ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది" అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.

# చెన్నై సూపర్ కింగ్స్ లో వాటా కావాలని ధోనీ అడగలే.. కానీ కోట్లు విలువ చేసే షేర్లు ఉన్నాయ్: అసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ఎంఎస్ ధోనికి రూపాయి వాటా కూడా లేదంటూ సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తేలిపోయింది. రూ.2,033 కోట్ల విలువైన ఈ ఐపీఎల్ ఫ్రాంచైజీలో ధోనికి ఏకంగా కోట్ల విలువైన షేర్లు ఉన్నట్లు వచ్చిన తాజా నివేదిక క్రికెట్ ప్రపంచంలో పెను సంచలనం సృష్టిస్తోంది.

**సీఎస్కేలో ధోని వాటా ఎంతంటే:**

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మూలస్తంభంగా ఉన్న మహేంద్ర సింగ్ ధోని సీఎస్కేలో దాదాపు 1 లక్ష షేర్లు కలిగి ఉన్నారు. వీటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.2.6 కోట్ల నుంచి రూ.3 కోట్లుగా ఉంది. కానీ ఫ్రాంచైజీ యాజమాన్యం నుంచి నేరుగా కాకుండా, అన్‌లిస్టెడ్ కంపెనీ అయిన సీఎస్కే షేర్లను ప్రైవేట్ ఆఫ్-మార్కెట్ లావాదేవీల (ాటట-మీుతీనెవ్ ఎతీుఅయిుషిఅశీఅం) ద్వారా మహీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

**సీఈఓ ఖండించినా బిగ్ ట్విస్ట్:**

ఎంఎస్ ధోని తమను వాటాల కోసం ఎప్పుడూ సంప్రదించలేదని, శ్రీనివాసన్‌తో కూడా దీనిపై చర్చించలేదని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ గతంలో క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం సీఎస్కే ప్రమోటర్ అయిన శ్రీనివాసన్ కుటుంబం దగ్గర 55 శాతానికి పైగా మెజారిటీ వాటా ఉండగా.. సాధారణ ప్రజల వద్ద ఉన్న 40 శాతం వాటా (30 కోట్ల షేర్లు) నుంచే ధోని తెలివిగా 1 లక్ష షేర్లను తన సొంతం చేసుకున్నారు.

**రూ.1200 కోట్ల బిజినెస్ సామ్రాజ్యం:**

దాదాపు రూ.1,200 కోట్ల నికర ఆస్తి కలిగిన మహేంద్ర సింగ్ ధోని కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు ద రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. చెన్నైయిన్ ఎఫ్‌సీ ఫుట్‌బాల్ టీమ్‌తో పాటు గరుడ ఏరోస్పేస్, కార్స్24, హోమ్‌లేన్, ఈమోటోరాడ్ లాంటి 15కి పైగా దిగ్గజ స్టార్టప్‌లలో ధోని వాటాలని కలిగి ఉన్నాడు. ఇప్పుడు సీఎస్కేలోనూ ఓనర్‌షిప్ వాటా బయటపడటంతో తలా ఈజ్ ది రియల్ బాస్ అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.

# టీమ్‌మేట్స్‌పై కాఫీ చల్లొద్దు బాస్.. కేఎల్ రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ స్ట్రిక్ట్ వార్నింగ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండో వేళ కేఎల్ రాహుల్ పేరు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ నుంచి రాహుల్ బయటకు వెళ్ళిపోతున్నాడని, కేకేఆర్ (ఖఖ=) జట్టు అతన్ని కొనుగోలు చేయడానికి సిద్ధమైందంటూ జోరుగా ప్రచారం జరుగుతుండగా.. ఢిల్లీ టీమ్ అఫీషియల్ ఇన్స్టాగ్రామ్ పేజీ చేసిన ఒక సంచలన కామెంట్ ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది.

**కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడా:**

ఐపీఎల్ 2026 సీజన్ సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ హేమాంగ్ బదానీకి, కేఎల్ రాహుల్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడిచిందని.. కోపంలో రాహుల్ ఏకంగా కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడంటూ నెట్టింట వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా రాహుల్ ప్రశాంతంగా కాఫీ తాగుతున్న ఫోటోను ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, డీసీ అఫీషియల్ హ్యాండిల్ స్పందిస్తూ.. ఎవరిపైనా కాఫీ చల్లకండి బాస్! (ఖఱంఱ జూవ జూష్రవసఎఱ ఎ్) అంటూ కౌంటర్ ఇచ్చింది. ఈ కామెంట్‌తో వివాదం నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కేకేఆర్‌కు ట్రేడ్ సస్పెన్స్‌పై క్లారిటీ:**

కాఫీ వివాదం కారణంగా కేఎల్ రాహుల్‌ను కేకేఆర్‌కు ఇచ్చేస్తున్నారనే వార్తలను ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ పూర్తిగా తోసిపుచ్చారు. రాహుల్ అత్యద్భుతమైన ఆటగాడని, రాబోయే కొన్ని ఐపీఎల్ సీజన్ల వరకు అతడే తమ ఫ్రాంచైజీ కీలక ప్లేయర్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశారు. దీంతో రాహుల్ ట్రేడింగ్ ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

**ఢిల్లీ తరఫున రాహుల్ రికార్డులు:**

2025 సీజన్: మిడిల్ ఆర్డర్‌లో దిగి 53.90 సగటుతో 539 పరుగులు.

2026 సీజన్: ఓపెనర్‌గా ప్రమోషన్ పొంది 174.41 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 600 పరుగులు.

ఓవరాల్ రికార్డు: 27 ఇన్నింగ్స్‌ల్లో 49.21 సగటుతో 1,132 రన్స్ (2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు).

అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ లాంటి టాప్ ఆర్డర్ బ్యాటర్ ని వదులుకోవడానికి ఢిల్లీ యాజమాన్యం సిద్ధంగా లేదు. వివాదాలను పక్కనబెట్టి రాబోయే సీజన్‌లోనూ రాహుల్‌నే తమ మెయిన్ వెపన్‌గా బరిలోకి దింపేందుకు సిద్ధమవుతోంది.



# 'వారణాసి' హైదరాబాద్ టూ అంటార్కిటికా జర్నీ!



ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోన్న సంచలన చిత్రం 'వారణాసి'. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. కథా నేపథ్యం, విజువల్స్ పరంగా చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన సంస్కృతులు, భౌగోళిక వాతావరణాల కలబోతగా రూపొందుతున్న చిత్రం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక్కసారి ఈ సినిమా విశేషాల్లోకి వెళ్తే.. ఈ సినిమా చిత్రీకరణ ప్రయాణం భాగ్యనగరం హైదరాబాద్‌లోనే ఘనంగా ప్రారంభమైంది. అధునాతన సెట్లు, కీలక నటీనటులపై ప్రధాన సన్నివేశాల చిత్రీకరణను ఇక్కడే పూర్తి చేశారు. నిర్మాణ పరంగా అన్ని సౌకర్యాలు కలిగిన హైదరాబాద్ నుంచి మొదలైన సుదీర్ఘ ప్రయాణం, కథాగమనానికి అనుగుణంగా దేశవిదేశాల్లోని అనేక విభిన్న ప్రాంతాలకు విస్తరించడం విశేషం. హైదరాబాద్ షెడ్యూల్ అనంతరం చిత్ర బృందం ఒడిశాలోని ప్రకృతి రమణీయమైన చారిత్రక ప్రాంతాలకు చేరుకుంది. అక్కడ అందుబాటులో ఉన్న సహజసిద్ధమైన లొకేషన్లు, దట్టమైన అడవులు మరియు తీర ప్రాంతాల్లో కీలక ఘట్టాలను చిత్రీకరించారు. ఒడిశాలోని ప్రత్యేక వాతావరణం సినిమాకు కావాల్సిన రా అండ్ రియలిస్టిక్ లుక్‌ను అద్భుతంగా అందించింది. అక్కడి నుంచి ప్రాజెక్ట్ గ్లోబల్ లెవెల్‌కు రీచ్ అయింది. ఆఫ్రికా ఖండంలోకి ప్రవేశించింది. ఆఫ్రికాలోని విలక్షణమైన భూభాగాలు, ఎడారి ప్రాంతాలు , సహజ అడవుల నేపథ్యంలో శ్రమతో కూడుకున్న యాక్షన్ సన్నివేశాలను రూపొందించారు. హాలీవుడ్ చిత్రాలకు తగ్గకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఆఫ్రికాలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయనడంలో సందేహం లేదు.

అన్నింటికంటే ప్రసిద్ధమైన అత్యంత సాహసవంతమైన ఘట్టం అంటార్కిటికా షెడ్యూల్. అత్యంత ప్రతికూల వాతావరణం, సున్నా కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న అంటార్కిటికా మంచు ఖండంలో షూటింగ్ జరపడం అరుదైన మైలురాయి. రికార్డు స్థాయిలో అత్యంత కష్టతరమైన పరిస్థితులను తట్టుకుని అక్కడ సాధించిన చిత్రీకరణ, విజువల్ పరంగా భారతీయ ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. హైదరాబాద్ టూ అంటార్కిటికా వరకు సాగిన ప్రయాణం లో కొంత భాగం మాత్రమే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఏడాది చివరికల్లా మిగతా చిత్రీకరణ పూర్తి చేస్తామని జక్కన్న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రదేశాల్లో.. ఇంకెన్ని దేశాల్లో షూటింగ్ జరుతుందన్నది ఆసక్తికరం. సినిమాకు సంబంధించి ఇంకా షూట్ చేయాల్సిన కీలకమైన సన్నివేశాలు చాలా ఉన్నాయి. వాటి కోసం సిటీలోనే ప్రత్యేకంగా సెట్లు నిర్మిస్తున్నారు. అవపసరం మేర ఔట్ డోర్...ఆ సన్నివేశాలు డిమాండ్ చేసే విదేశీ లొకేషన్లను షూటింగ్ నిర్వహించనున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com